సుదర్శన్ థియేటర్ వద్ద పోలీసు బందోబస్తు

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హీరో రామ్‌చరణ్ తేజ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా విడుదల సందర్భంగా గురువారం సాయంత్రం సుదర్శన్ థియేటర్ వద్ద పోలీసులు పలుమార్లు తనిఖీలు నిర్వహించారు. థియేటర్ పరిసరాలను పరిశీలించినట్లు సమాచారం. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంఘటన నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకే షో మొదలు కానుండడంతో గురువారం సాయంత్రం నుంచే పోలీసులు థియేటర్ వద్ద బందోబస్తులో ఉన్నారు.


దివ్యాంగులకు టీడీపీ సభ్యత్వం అందజేస్తున్న అరవింద్‌కుమార్‌గౌడ్, సాయిబాబా

టీడీపీ ఆవిర్భావం తర్వాతే దివ్యాంగుల సంక్షేమం

రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతనే దివ్యాంగుల సంక్షేమం ప్రారంభమైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. 1983 జనవరి 9వ తేదీన పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆధ్వర్యంలో గురువారం నగర కార్యాలయంలో దివ్యాంగులకు సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సీఎంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. దివ్యాంగుల సభ్యత్వ రుసుంను తాను చెల్లిస్తానని ఆయన ప్రకటించారు. పి. సాయిబాబా మాట్లాడుతూ.. దివ్యాంగుల ప్రమాద బీమాను రూ. 5 లక్షలకు టీడీపీ పెంచడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, సాయిబాబా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ వాసులకు న్యాయం చేయాలి


ఆర్డీవోతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వామివివేకానందనగర్ వాసులకు న్యాయం చేయాలని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ కోరారు. గురువారం సికింద్రాబాద్ ఆర్డీవో, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఏడాది జనవరి 29న వివేకానందనగర్ బస్తీలో 75 సంవత్సరాలుగా ఉంటున్న 19 దళిత కుటుంబాల ఇళ్లను రెవెన్యూ, జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారని వివరించారు. బాధితులకు ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించలేదన్నారు. వారికి ఇళ్లు కేటాయించాలని ఆర్డీవో, తహసీల్దార్‌ను కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ బాధితులకు న్యాయం చేసే విషయంపై సానుకూలంగా ఉన్నారని, అలాట్‌మెంట్ వివరాలు పంపితే ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆర్డీవో, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వినయ్‌కుమార్, బస్తీ వాసులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుల ధర్నాలో సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ తదితరులు

ఫిబ్రవరిలో దివ్యాంగుల 'చలో ఢిల్లీ'

రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని దివ్యాంగుల సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ తెలిపారు. డీఎస్‌డీ దివ్యాంగుల సంస్థ రాష్ట్ర నాయకుడు కాటమోని వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఐడీ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్లతో ఫిబ్రవరి 24న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలి

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కనీస పెన్షన్ రూ. 300 నుంచి రూ. 5 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 10న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె. వెంకట్, ఎం. అడివయ్య తెలిపారు. 'చలో ఢిల్లీ' పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కోశాధికారి ఆర్. వెంకటేష్, సభ్యులు శశికళ పాల్గొన్నారు.

రజక వృత్తి ఆధునికీకరణకు కృషి

● బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్


మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రజక వృత్తి ఆధునికీకరణ, ఉపాధి కల్పనకు ప్రభుత్వపరంగా కృషి చేస్తామని బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రజకులకు ఉపాధి కల్పన అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తుల అభివృద్ధి అంశం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నరేష్, వివిధ సంఘాల నాయకులు ఎం.వి.రమణ, ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, పైళ్ల ఆశయ్య, ఎం. గోపాల్, ఉపేందర్, వెంకటేశ్వర్లు, సుభద్ర పాల్గొన్నారు.

సమగ్ర వాఙ్మయమూర్తి పింగళి లక్ష్మీకాంతం

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి పింగళి లక్ష్మీకాంతం చేసిన కృషి అమోఘం అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డా. అయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం ఎందరో మహానుభావులు కార్యక్రమం పరంపరలో భాగంగా పింగళి లక్ష్మీకాంతం యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. శ్రీధర్ మాట్లాడుతూ.. లక్ష్మీకాంతం సమగ్ర వాఙ్మయమూర్తి అని అన్నారు. ఆయన రచించిన ఆంధ్ర సాహిత్య చరిత్ర పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సినీ నిర్మాత రామసత్యనారాయణ, కళాపోషకులు వీఎస్ఆర్ మూర్తి, గాయని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఈవో అన్నపూర్ణ


బందోబస్తు గురించి సిబ్బందికి సూచనలు చేస్తున్న సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ శిల్పవల్లి, అదనపు డీసీపీ ఆనంద్‌కుమార్, చిక్కడపల్లి ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్


పూలతో అలంకరించిన ఆలయం


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఎస్. అన్నపూర్ణ తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్ల వివరాలు వెల్లడించారు. క్యూలతోపాటు ఆలయం లోపల, వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించామన్నారు. ప్రసాదాల టికెట్ల జారీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. 300 మంది వలంటీర్లను నియమించామని తెలిపారు. ఉదయం 4.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. పోలీసు ఔట్ పోస్టు, మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేశామని ఈవో తెలిపారు.

భోలక్‌పూర్‌లో రూ. 1.50 కోట్లతో రోడ్లు ఆధునికీకరణ

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


భోలక్‌పూర్‌లో పర్యటించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ఇలాగేనా.. చెట్లకొమ్మలకు విద్యుత్ తీగలు ఆనుకొని ఉన్నా తొలగించరా.. విద్యుత్ దీపాల నిర్వహణ ఇలాగేనా.. రోడ్లపై డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మూతలు ప్రమాదకరంగా ఉన్నా మరమ్మతులు చేయరా.. అని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం భోలక్‌పూర్‌లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలతా శోభన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌తో కలిసి పర్యటించారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ సమస్యలపై ప్రస్తావించడంతో భోలక్‌పూర్‌లో పర్యటించామని తెలిపారు. రూ. 1.50 కోట్లతో రోడ్లను దశలవారీగా ఆధునికీకరిస్తామన్నారు. అంజుమన్ స్కూల్ వద్ద విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు.

ఎంపీ ఎం.అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంగపాక వెంకట్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, డీఎంసీ ఖదీర్ మొయినుద్దీన్, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ సన్నీ, ఏఈ సుభాష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, కాంగ్రెస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు జఫీర్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు అడిగితే కేసులు పెడతాం

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే కేసులు పెడతామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. గురువారం భోలక్‌పూర్‌లో పర్యటించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై సర్వే చేస్తున్నామని, ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు సేకరించడి డాటా ఎంట్రీ చేస్తున్నామని తెలిపారు. ఆర్పీలకు సహకరించాలని కోరారు. నాయకులు, అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇటీవల కూకట్‌పల్లిలో ఓ అధికారిని సస్పెండ్ చేశామని గుర్తు చేశారు.

ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

'ఏడేళ్లయినా పూర్తికాని ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మేయర్ విజయలక్ష్మి స్పందించారు. గురువారం కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్ పనుల పూర్తికి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.


రామ శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న నవీన్ తదితరులు

పద్మశాలీల ఐక్యతకు శ్రీనివాస్ కృషి మరువలేనిది

ముషీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ పద్మశాలీల ఐక్యత, సమస్యల పరిష్కారానికి చేసిన కృషి మరువలేనిదని పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారి బింగి నవీన్ కొనియాడారు. గురువారం భోలక్‌పూర్‌లో పద్మశాలి సంఘం కార్యాలయంలో రామ శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. నవీన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ ఆశయాలకు అనుగుణంగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ, కృష్ణమూర్తి, సుధాకర్, నవీన్‌కుమార్, పుండరీకం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నందరాజ్‌ను పరామర్శిస్తున్న బూర నర్సయ్యగౌడ్

నందరాజ్‌కు ఆర్థిక సహాయం

కవాడిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిలో గాయపడిన కార్యకర్త నందరాజ్‌కు మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పదివేల రూపాయలు అందజేశారు.నందరాజ్ నివాసానికి గురువారం వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహాకాళి జిల్లా ఓబీసీ మోర్చా సోషల్ మీడియా కో-కన్వీనర్ తొలుపునూరి రమేష్‌గౌడ్, బీజేపీ డాక్టర్ సెల్ కో-కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంస్థ రాగ మాధురి 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం త్యాగరాయగానసభలో నిర్వహించిన స్వరమాధురి తెలుగు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సుశీల తదితరులు ఆలపించిన గీతాలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవీ పుల్లారావు, ప్రధానకార్యదర్శి ఎస్. శ్రీనివాసులు, ఆనంద్‌కుమార్, అఖిల, సంతోష్ మాచెర్ల, కామేష్, స్వప్న, సత్యదీప్తి, స్వప్న ఆలపించి శ్రోతలను రంజింపజేశారు. శివరామ్‌రెడ్డి, సూర్యతేజ, మోహన్‌లు వాద్యసహకారం అందించారు.

19న కార్మిక, కర్షక ఐక్యతాదినం సదస్సులు

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్యతా దినం సదస్సులను విజయవంతం చేయాలని, ఐక్య ఉద్యమాల తోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐడబ్ల్యూయూ ఉమ్మడి సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు నాగయ్య, పాలడుగు భాస్కర్, టి సాగర్ పిలుపునిచ్చారు. గురువారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈనెల 19న రాష్ట్రంలోని జిల్లా, మండల కేంద్రాల్లో ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

రైలులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ చోరీ

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని పారిపోయాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మాధవి (48) విశాఖపట్నం నుంచి కాచిగూడకు మహబూబ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తోంది. కాజీపేట్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి కిటికీలో నుంచి ఆమె హ్యాండ్ బ్యాగ్ లాక్కొని పారిపోయాడు.

బాధితురాలు గురువారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగ్‌లో 76 గ్రాముల బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 19 వేలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి కాజీపేట రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో 50 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ పట్టాలు దాటుతుండగా కాచిగూడ - కర్నూలు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బతుకమ్మకుంటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలి'

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మకుంటలో వీహెచ్ఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని తెలంగాణ జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. బతుకమ్మకుంట పరిరక్షణ కోసం మాజీ ఎంపీ వి.హనుమంతరావు కృషి చేశారని, ఆయన పేరు మీద స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే స్థానిక యువత, క్రీడాకారులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

అంగన్‌వాడీల్లో చిన్నారులకు దుస్తుల పంపిణీ

గోల్నాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గంగానగర్, తులసీరాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పావని, విజయలక్ష్మి, సరళ, ధంజు, మంజుల, ఉమారాణి తదిరులు పాల్గొన్నారు.


బాలవాణి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రచనశ్రీ, పాఠశాల ప్రతినిధులు

'బాలవాణి' నిర్వహణ అభినందనీయం

కవాడిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు బాలలతో బాలవాణి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అన్నారు. గురువారం దోమలగూడ భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ స్కూల్‌లో ఇంద్రధనస్సు, బాలల సంఘం, బాలవాణి కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు బస్తీలో పర్యటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను బాలలతో చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అప్సా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శిరీష, అప్సా సామాజిక కార్యకర్త బొట్టు రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు జి. వెంకటేష్, జలమండలి ప్రతినిధి వినయ్‌కుమార్, ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ ప్రొఫెసర్ శ్రీరాం, అంగన్‌వాడీ టీచర్ పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు


ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కార్యవర్గం


రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం రాంనగర్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీ.హెచ్.వీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శివకుమార్, కోశాధికారిగా కె.నర్సింహ, ప్రచార కార్యదర్శిగా జీవన్‌రెడ్డి, సలహాదారులుగా నాగవాణి, ఉపాధ్యక్షులుగా బి.కనకరాజు, భీష్మాచారి, ఎం.జాహంగీర్, కార్యదర్శులుగా బి.సతీష్, అఖిలేష్, బి.మనోహర్, సభ్యులుగా ప్రేమ్‌సాగర్, రాంరెడ్డి, సంపత్, బాలకృష్ణ, జి.శ్రీనివాస్, శ్రీధర్, వేణుగోపాల్, రహీం ఎన్నికయ్యారు. వీరి పదవీ కాలం రెండేళ్లు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు


చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ వినోద్ కుమార్ తెలిపారు. అంజయ్యభవన్, ఎర్రమంజిల్ ఫీడర్ల పరిధుల్లోని హనుమాన్ టెంపుల్, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సిటీ సెంట్రల్ లైబ్రరీ, చిక్కడపల్లి, వివేక్ నగర్, బాపూనగర్, పెట్రోల్‌బంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


సాయికృష్ణ యాదవ్


గడ్డం సతీష్


సలంద్రి దిలీప్‌యాదవ్


ఎ.కంచికుమార్ ముదిరాజ్


వి.నవీన్‌కుమార్

బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో ఐదు డివిజన్లకు అధ్యక్షులను బీజేపీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మాధవరం కాంతారావు, సీహెచ్ శంకర్‌రావు, బి. వేణుమాధవ్ గురువారం ప్రకటించారు. అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడిగా పాశం సాయికృష్ణయాదవ్, రాంనగర్‌కు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గడ్డం సతీష్, దోమలగూడ డివిజన్ అధ్యక్షుడిగా బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఎ.కంచికుమార్ ముదిరాజ్‌ను, గాంధీనగర్‌కు వి. నవీన్‌కుమార్‌ను నియమించారు. భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడి ఎన్నిక నిలచిపోయింది. త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

వివాదంగా భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్ష పదవి

45 ఏళ్ల నిబంధనే కారణమా?

ముషీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో ఐదు డివిజన్‌లకు గురువారం అధ్యక్షులను ప్రకటించారు. భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడిని ప్రకటించకపోవడం వివాదంగా మారింది. అధ్యక్ష పదవి కోసం పార్టీ సీనియర్ నాయకుడు బిజ్జి కనకేష్‌కుమార్, హిదూవాహిని నాయకుడు బబ్లూ, పార్టీ నాయకులు మేడి ప్రభాకర్, రాజశేఖర్, సన్నీ దరఖాస్తు చేసుకున్నారు. బిజ్జి కనకేష్‌కుమార్, బబ్లూ మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో డివిజన్ అధ్యక్ష పదవి ప్రకటించడాన్ని నిలిపివేశారు. బిజ్జి కనకేష్‌కుమార్ పేరు ప్రకటించకపోవడంతో ఆయన పార్టీ సీనియర్ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. 1986 నుంచి పార్టీ కోసం పనిచేస్తూ భోలక్‌పూర్ డివిజన్ స్లమ్ కన్వీనర్‌గా, ఉపాధ్యక్షుడిగా, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడితోపాటు పలు పదవుల్లో పనిచేశానని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్ష పదవి ఇవ్వమని 20 ఏళ్ల నుంచి అడుగుతున్నా పలు కారణాలు చెబుతున్నారని వాపోయాడు. 45 ఏళ్ల లోపు వారికే అధ్యక్ష పదవి ఇస్తామని నిబంధన విధించడం ఎంతవరకు సమంజసమన్నారు. వయస్సు నిబంధన విధించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్ష పదవిపై నిర్ణయం తీసుకుంటామని నియోజకవర్గం అగ్రనాయకులు కనకేష్‌కుమార్‌కు సూచించినట్లు సమాచారం.